
# సమ్మాన భంగం

– కె. కె. రఘునందన




'నన్ను ఆలోచించుకోనీకుండా మిమ్మల్నెవరు ఒప్పేసుకోమన్నారని... ఆవిడ అడగడమూ బాగుంది... మీరు బుర్రూపటమూ బాగుంది... ఛఛ!! నాకస్సలు ఇష్టం వుండదు' శ్రీమతి కావ్యశ్రీ చిరచిరలాడింది.

ఆ రగడ అసలు జరక్కపోను!

ఆమెనే అన్నమాటేమిటి నన్ను మాత్రం అస్సలు ఆలోచించుకోనిచ్చిందా ఆ కాంతమ్మ.

కాంతమ్మ ఆకారంలో అనిరమ్మ... రిటైర్మెంటుకింకా ఐదారేళ్లుంది... మొగుడు మొద్దులు లేని ఏకాకి. పనున్నా లేకున్నా సరే, తెగిన గాలిపటంలా అటూ ఇటూ తిరుగుతూ రోడ్లు సర్వే చేస్తుంటుంది. పండెంట్రుక లెందుకింకా రాలేదని బుర్ర పీక్కునే వారికి, 'వేస్మాల్ – థర్టీ త్రీ' రహస్యం ఏమాత్రం చెప్పదు. అంతే కాదండోయ్! పెదాలు, బుగ్గల్లోని స్మాల్ రెడ్డిష్‌నెస్‌ను గురించి కూడా గప్‌చిప్!!

ఇన్ని హంగులున్నా... కాంతమ్మ ఈజీక్వల్ టూ పెద్దసైజు పర్వతమే!

ప్రధానాంశంగా చెప్పదలిస్తే కాంతమ్మ కొంతకాలం తన రచనా వ్యాసంగం సాగనిచ్చింది హరీబరీగా, హడావుడిగా. అయితే సంపాదకులు మాత్రం ఆవిడ 'పస' పసిగట్టలేని వెర్రి వాజమ్మలు కారు... అట్నుంచటే తిరక్కొట్టేవారు...

దాంతో తనకు ప్రచురణ రంగం ఏమాత్రం అచ్చిరాలేదని చాటుకుంది. అయితే తనకు గుర్తింపంటూ ఏదో ఒకలాగుండాలని చదువుల తల్లిని పట్టుకు ప్రాకులాడింది. తనకు తోకలా డిగ్రీలు తగిలించుకుంది. 'అబ్బే! బోడి డిగ్రీలు ఎవడికి లేవూ...' అంటూ సహచరులు తేలిగ్గా తీసిపారేశారు.

ఇంక ఇలా కాదనుకుని మరో ఆయుధంగా 'మహిళల మూక' అన్న సంఘం నెలకొల్పింది. ఏ విధంగానైనా పైకొస్తున్న మహిళ ఆవిడ కళ్లల్లో పడిందంటే చాలు ఆహుతైపోవలసిందే! (ఆహ్వానించబడ్డ వారిని ఆహూతులనడం

పరిపాటి)

కాంతమ్మ పరిస్థితి అలాంటిదైతే... మా ఆవిడకేమో... 'సరాగ' పత్రికవారు ఇటీవల నిర్వహించిన నవలల పోటీల్లో ముప్పైవేల రూపాయలు ముట్టజెప్పారు. ఈ విషయం వారికీ వీరికీ తెలిసింది. అలాగని వూరుకున్నారా! బంధుగణం అసురగణంలా మీద పడ్డది. గుండెలు పిండేసి పార్టీలు ఇమ్మంది... నా జేబులు కొల్లగొట్టింది. అంతే తప్ప, ఏ ఒక్కరూ కనీసం అభినందన చందనం పూయటానికి గానీ, ఓ దుశ్శాలువ కప్పటానిగ్గానీ ముందుడుగు వేయకపోవడం... ఏమరుపాటుగా ఒంటిమీద నిప్పు పడ్డా కూడా ఉస్సురని నిట్టూర్చటమన్నంత (సహజం) నిజం!

అదే శ్రీమతి కావ్యశ్రీని మండించింది. ఆ మంట మంటలా వుండిపోలేదు. క్రమేపీ రాజుకుంటూ పోయింది.

ఆ అగ్గికి ఆజ్యం పోసేలా కాంతమ్మ ప్రవర్తన...

'ఏమండీ! మీ ఆవిడ్ని సన్మానిస్తున్నాం... రేపు ఆరో తేదీన...'

రోడ్డు మీద కనీకనిపించగానే, ఒక్కసారి గతుక్కుమనేలా ప్రకటించింది.

అప్పుడే ఈ రోజు రెండో తేది. ఇంత అర్జంటుగా సన్మానమా...?!

'ఏమండీ! మీరు ఇంత హరీబరీగా మా ఆవిడకి సన్మానం చేయకుంటే నష్టమేంటి. నేనింకా ఆవిడ్నడగాలి' అని అక్కడ్నించి ఉడాయించడానికి సిద్ధపడ్డాను.

అయినప్పటికీ నన్ను ఒక్కుదుట్న అటకాయించి– 'వీల్లేదు. ఎప్పటినుంచో అనుకుంటున్నాం. ఈ నెల సభలో మీ ఆవిడ్ని స్టేజి ఎక్కించాల్సిందే. కొండంత భర్త మీరుండగా ఇంక ఆవిడ పెర్మిషనేంటి బోడి...' అని తెగించి వెళ్లిపోయింది.

నా గుండెలదిరిపోయాయి.

చెప్పలేక చెప్పలేక నసిగి, నసిగి చెప్పాను మా ఆవిడతో...

'హత్తెరి... నేనంత కనాకష్టంగా కనిపించానా! ఆవిడేదో స్టేజి మీదకెక్కించి చెక్క భజన చేయిస్తే నేను మిడిగుడ్లేసుకుని కుర్చీకి అతుక్కుపోవాలా... దానికయినా నా పర్మిషన్ అవసరమా, కాదా! అదావిడగారు గ్రహించాలా, వద్దా! వెర్రెత్తడంలో 'గంగ'ను మించింది.

రెండు దశాబ్దాలయి ఉత్తరాంధ్రలో ఇంతటి మహోన్నత పురస్కారం ఎవరికీ లభ్యం కాలేదన్న గర్వం మా ఆవిడదైతే... ఇలాంటి వ్యక్తులెంత మందినో వెతికి మరీ వేదిక నెక్కించిన ఘనురాలు తనేనన్న మిడిసిపాటు కాంతమ్మది.

మధ్య నలిగిన నరుడ్ని నేనే మరి!

'లేదు... ఇంత సడెన్‌గా ప్రోగ్రాం ఫిక్స్ చేసేసి చెక్క భజన చేయించడానికి నేను ససేమిరా ఒప్పుకునేది లేదంతే' మొహం మాడ్చేసింది.

'అయితే, ఓ పని చెయ్... కాంతమ్మతో సన్మానం వద్దని చెప్పెయ్యి... ఆ రోజు నీకేదో పనుందని కుంటిసాకు చెప్పు' బోడి సలహా పారేశాను.

అనటమేంటి... వెంటనే నా దగ్గర్నుంచి ఫోన్ నెంబరు తీస్కుంది. చెడామడా ఏకి పారేద్దామని, వీలైతే రెచ్చిపోయి పుచ్చ చీవాట్లు వేయటానికి కూడా వెనుకాడని మనిషిలా కనిపించింది.

నేను ఆ ఎడాపెడా వాదనను భరించే ఓపిక లేని వాడనై బయటకు చెక్కేశాను.

అర్ధగంట తరువాత తిరిగి వాలాను.

శ్రీమతి కావ్యశ్రీ మొహం వాడిపోయి వున్నది.

'ఏమైంది! తప్పిందా గండం?!' అడిగాను నా నెత్తిన బరువు తొలగి వుంటుందని.

'లేదు... బలవంత బ్రాహ్మణార్థం తప్పుతుందా?' అని నావంకే నిష్ఠూర దృక్కు విసిరింది.

'ఏం ఖండించలేకపోయావా!'

'ఏం ఖండించేది? మొగుడంతటి వాడి చెవిలో వేశాక అదే తనకు గ్రీన్ సిగ్నల్ అనుకుందిట. దానికి తగ్గ ఏర్పాట్లు చూసే పనిలో పడిందట. తను చేసిందంతా కరెక్టేనని అడ్డగోలుగా వాదించింది. ఆ మహాతల్లితో వాదించే ఓపిక నశించి పోయిందనుకోండి' అని ఆమె బిక్కమొహం వేసింది.

'అయిందేదో అయింది. ఎలాగయితేనేం, కొన్ని విషయాల్లో సర్దుబాటు తప్పదు' అని ఊరడించాను.

'నా బయోడేటా, కొన్ని కథలు అడిగింది. ఇవ్వమంటారా! తప్పదా!' ఏడుపు మొహమే మిగిలింది.

'నీకంటూ ఉద్దేశ్యం ఏర్పడితే తప్పదు. నీ గురించి సభలో ఎంతో కొంత చెప్పాలి కదా! దానికే అడిగుంటుంది' ముక్తసరిగా చెప్పాను.

'అయితే కాంతమ్మ బారినపడ్డ జాబితాలో నేనూ చేరక తప్పదన్న మాట...' ఇంకా మబ్బులు వీడలేదు.

ఆ సాయంత్రం తప్పనిసరయి కాంతమ్మ ఇంటికి బయలుదేరాను. కానీ ఆమె జాడే లేదు. తాళం కప్ప వెక్కిరించింది.

ఒకావిడ మాత్రం కిల్లీ వుమ్ముకుంటూ కూర్చుంది బయట.

'కాంతమ్మ గార్లేరా?' ప్రశ్నించాను.

'ఆవిడ ఎక్కడ తిరుగుద్దో... నాకు తెల్వదు. వూరికెళ్తానని ఎవరితోనో అంటుంటే విన్నా... ఎల్లుండిదాకా రాకపోవచ్చు'

చిరాగ్గా అంటుంటే- ఆవిడకీ, ఈవిడకీ ఏదో విషయంలో నప్పలేదు కాబోలు.

'పోనీ ఏమైనా చెప్పిందా...'

'ఏమీ చెప్పలేదు' పెదవి విరిచింది.

ఎంత ఘోరం... ఇంక రెండ్రోజుల్లో ఫంక్షన్. ఇప్పటికీ కరపత్రాల ఊసు లేదు. బయోడేటా వచ్చి తీసుకోలేదు. పక్కింటామెకీ చెప్పలేదు. ఫోన్ చెయ్యనే లేదు.

కాంతమ్మ నిర్లక్ష్య వైఖరి, మొండితనానికి ఏం చేయాలో పాలుపోలేదు. అంటే ఏదో విధంగా సభ అయిందనిపించేద్దామనా...


# మోనికా బుక్స్

**తెలుగు వెలుగులు**
(75 మంది ప్రముఖుల పదచిత్రాలు-బాపు బొమ్మలతో)
వెల 85 రూపాయలు

**కథా పత్రిక**
(20 కథల సంపుటి)
వెల 60 రూపాయలు

**ఐ.వి.ఆర్.-రాజసూయం**
(ఉలుకు-పలుకు వ్యాసాల సంకలనం)
వెల 75 రూపాయలు

**ఒకే ఒక్కడు**
(ఎన్.టి.ఆర్. జీవితకథ)
వెల 150 రూపాయలు

**విశ్వవిహారం**
(యాత్రా రచన)
వెల 60 రూపాయలు

విశాలాంధ్ర బుక్‌హౌస్‌తో సహా ప్రముఖ పుస్తకాల షాపులలో ఇవి లభిస్తాయి. పోస్టు ద్వారా తెప్పించుకోదలచిన పాఠక మిత్రులు పుస్తకం విలువను ఎం.ఓ. లేదా డి.డి. రూపంలో ఈ క్రింది అడ్రసుకు పంపండి. పోస్టేజి ఉచితం.

**మోనికా బుక్స్**
79బి, జర్నలిస్ట్స్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.

ఇటువంటి వాటికి కావ్యశ్రీ అసలే బద్ధ విరోధి!

తనని అనుమతి అడక్కపోవటం ఓ నేరమైతే, అంతకంటే మహా నేరం కనీసం కరపత్రాల ప్రచురణ లేకపోవటం ఆవిడ దృష్టిలో...

రోడ్డుమీద కెళ్లాను. ప్రవాసరావు కలిశాడు. వాడితో విషయం కక్కాను.

'ఓహో... కాంతమ్మా! ఆవిడ ఎవరినో ఒకర్ని స్టేజి ఎక్కించందే వదల్దు. మీ సంగతి నాకు తెలీదు గానీ, మా పక్కింట్లో అద్దెకుండే ఆకు వాయిద్యగాడు 'ఆర్ముగం'ను కూడా సన్మానిస్తుందిట. మరింకా ఎవరంటే... దూదితో బొమ్మలు చేసే ధనలక్ష్మిని కూడా ఎక్కిస్తుందని చెప్పారు. ఆఁ మరో సంగతి... సాయి నామాన్ని అత్యంత అధికంగా పోస్టుకార్డు మీద ఇరికించి రాసిన కోదండమ్మను సన్మానించాలని ప్లాన్ చేస్తోందిట. మరి మీ విషయం నేనెక్కడా విన్లేదే...' అని తెల్లమొహం వేశాడు.

ఇంతమంది 'మూక' మధ్య మా ఆవిడకి సన్మానం లేకపోతే మహాదృష్టవంతుల్లో మేం ఒకళ్లం...

'అదే జరిగితే నేను యమలక్కీని. గుంపులో గోవిందమ్మలాగా నేనూ కాంతమ్మ ఇచ్చే ఏదో చిప్ప కోసం ఎగబడే బాధ తప్పుతుంది. తనకంటూ సన్మానం జరగకపోతే దేవుడికి తృణమో పణమో సమర్పించుకుంటాననే భావంతో వున్నట్లుగా తోచింది.

అయితే ఇక్కడ కథలో మరో మలుపు ప్రారంభమైంది. మా ఆవిడకి బాబాయిగారు గురుదత్త. పేరున్న రచయిత. పూర్వకాలం మనిషి యాభై యేళ్లయి వ్రాస్తూనే వున్నారు. ఆయనకు తెలీని సాహితీవేత్తగానీ, సంఘనిర్వాహకులను గానీ వేళ్లమీద లెక్కపెట్టవచ్చు.

సాధారణంగా ఏ సలహానూ, సూచననూ పెద్ద తలకాయగా ఆయన్నే అడుగుతుంది కావ్యశ్రీ.

ఈ కాంతమ్మ విషయంలో కూడా అమీతుమీ తేల్చుకుందామనే గట్టి నిశ్చయానికి వచ్చింది. గురుదత్త గారిని కలవాలనుకుంటుంటే... ఆయనే వచ్చారు.

'ఏదయ్యా! మీ ఆవిడ్ని పిలు...' కయ్యానికి కాలుదువ్వేలాగున్నారు గురుదత్తగారు.

'ఏంటండీ! మీ ఆవేశం ఏమిటి?' చిత్రంగా చూశానాయన విచిత్ర వైఖరికి.

ఈలోగా కావ్యశ్రీ హాజరయింది.

'ఏంటండీ... బాబాయిగారూ!' కాఫీ ఇస్తూ అడిగింది.

'ఆహా! చాలా బాగుందమ్మా! మీరిద్దరూ కూడబలుక్కునే వున్నారన్నమాట... ఆది తుది లేని సంభాషణ ప్రారంభించారు.

'ఇంతకీ...?' డైలమాలో పడ్డం మా వంతయింది.

ఆ 'సిరి కిరణ్' నీ కాలి గోటికి పోలడమ్మా... వాడికీ, నీకూ ఒక్క వేదికా? అసలు నువ్వెలా ఒప్పుకున్నావమ్మా? నిన్ను సంతలో చింతపండులా చులకనగా చూడ్డానికి ఆ కాంతమ్మ ఎంత కుట్ర పన్నింది...' అగ్గయిపోయారు.

మా ఇద్దరికీ బుర్ర తిరిగిపోయింది.

'అసలు సిరి కిరణ్ ఎవరు? అతగాడితో వేదికనెక్కేందుకు మేం ఒప్పుకోవటమేంటి?' వివరంగా చెబుదురూ బాబాయిగారూ!' బ్రతిమాలుడు ధోరణి మొదలెట్టింది.

సిరి కిరణ్ ఏగానీకి కొరగాని రచయిత. వాడి బేడా పరక కథలు, కవితలు ఏ ఒక్క పత్రిక ప్రచురించిన పాపాన పోలేదు. అందువల్ల తనకంటూ గుర్తింపొకటి ఏడవాలని చెప్పి, ఒక షావుకారుకి అంకితమిస్తానని చెప్పి, అతగాడిని ఉబ్బించి కవితలను అచ్చొత్తించుకున్నాడు. దానికి తనే ఓ వెయ్యి రూపాయలు కాంతమ్మ మొహాన

## మనిషి

మనిషిగా పుట్టి కట్టెల్లో కాలే భోగికన్న
అడవిలో పుట్టి కట్టెగానే కాలే బొగ్గునైతే మిన్న!
మనిషిగా పుట్టి భ్రష్టాచార ద్విపాద పశువు కన్న
మనిషిచే కట్టే పాడిచ్చే చతుష్పాద పశువు మిన్న!
మనిషిగా పుట్టి మరమనిషిగా బతికేకన్న
రాతి కట్టడాన్నై ఆశ్రయాన్నిచ్చే బండరాయి మిన్న!

– దుర్గమహాంతి మోహనరావు.

కొట్టి ఏనాటినుంచో స్టేజి ఎక్కాలని గోతికాడ నక్కలా కాచుక్కూచున్నాడు. రోగి పాలే కోరాడు, వైద్యుడు పాలే చెప్పాడు- అన్న చందంగా, ఒకే దెబ్బకు రెండు పిట్టల్లాగ కుదిరిందని చెప్పి, సిరి కిరణ్‌ను సన్మానిస్తూ, నిన్ను కూడా అదే క్యూలో నిలబెట్టింది' ఊపిరి బిగపెట్టి మరీ చెప్పేశారు.

'ఎంత మోసం! మీ ఆవిడ మహిళగా సాధించిన విజయానికి నేను గర్విస్తున్నాను... అనంటే పోనీ ఏదో పెద్దావిడ ప్రాకులాడుతున్నది కదా! కాదంటే బాగోదని సర్దుబాటు చేసుకుందామనుకున్నాం... కానీ మహిళా సభలో మగాడికి పెద్దపీట వేస్తుందన్న సంగతి మేం ఎరగం కాక ఎరగం...' ముక్కు మీద వేలేసుకున్నాను.

కావ్యశ్రీ అయితే మరీను. కళ్లు వెడల్పుగా చేసేసుకుని, ముక్కుపుటాలెర్రగా చేసుకుని కోపోద్విగ్నతకు లోనయింది. ఈ పెద్దాయనకు గతం, ప్రస్తుతాలు వివరించాల్సిందే...' అని పూస గుచ్చాను.

'ఆహాఁ అంతక్కూడా తెగించిందా... అంటే మీకు స్వయంగా వచ్చి చెప్పేదేంటి బోడి... నా సభంటే ఎంతటి వారయినా సరే విరాళాలిచ్చి మరీ క్యూ కడతారు. అనేగా ఆ మహాతల్లి ఉద్దేశ్యం. కానీండి... ఎలా జరుపుతుందో చూద్దాం' అని ఒక్కటే వుక్కిరిబిక్కిరైపోయారు.

మా పట్నంలో చాలా సభల మీద గురుదత్త గారు ఎంతో కాలంగా అగ్రహోదగ్రులౌతూ వస్తున్నారు. యాభై యేళ్లయి వ్రాస్తున్న సీనియర్‌గా తనకంటూ ప్రత్యేక సభ నిర్వహించి కీర్తి కిరీటం తొడగలేదని మహా అక్కసుగా వున్నది.

'మాకూ సన్మానాలంటే మక్కువ లేదు' నిష్కర్షగానే చెప్పాను.

'అదీ, అలా రండి దారికి... ఒకవేళ మీకంటూ కరపత్రమేదైనా అందినప్పటికీ, ఫోన్ కాలేదైనా వచ్చినప్పటికీ మీరు పొంగిపోయి పరిగెత్తకండి. ఇటువంటి సన్మానాల వల్ల కీర్తి గడించేదేంటి బోడి... మనకంటూ కొన్ని స్టాండర్డ్ పత్రికలున్నాయి. వాటిలో పడితే గొప్ప కాని... అని లేచెళ్లి పోయారు.

గురుదత్త గారు నిష్క్రమించినాక మా ఆవిడకి కారం రాసుకున్నట్లయింది. స్త్రీకి శత్రువు స్త్రీయే అన్న సామెత తన పట్ల బుజువైందన్నది. సిరి కిరణ్ సరసన తనను కుదేసి కూర్చోబెట్టి... పరువు తీయటానికి ఆమె పన్నాగం పన్నిందని... ఈ విషయమై రాజీపడే ప్రసక్తే లేదని...' ప్రచండ తాండవమాడింది.

నిజానికి మర్నాడే సభ.

తెల్లవారుతూ వచ్చిన పేపర్లో, 'సిరి కిరణ్ సన్మానానికి ఏర్పాట్లు పూర్తి' అన్న హెడ్డింగ్‌తో వచ్చిన న్యూస్ చూసిన కావ్యశ్రీ వెర్రి వికారాలెత్తిపోయింది.

'ఈ కాంతమ్మ చేసే చిట్టి సభకు ఏర్పాట్లేంటి నా మొహం. కానీ... పైగా నా పేరేమో కత్తిరించి పొడి అక్షరాలతో వేస్తుందా... అదీ చివర్న' చేతిలో పేపరు వుండ చుట్టి కసిగా విసిరేసింది.

ఓర్నాయనోయ్... ఎంత ఘోరం! సన్మానానికి పిలిచి పరాచికాలాడ్డం కాంతమ్మకు వెన్నతో పెట్టిన విద్యలా వుందే! కనీసం ఫోన్ చేయలేదు. కరపత్రం వూసులేదు.

ఇదే సంగతి తర్జన భర్జన చేస్తుండగా గురుదత్త గారు ఫోన్...

'చూశావమ్మా! నిన్ను అభానుపాలు చేయటానికి కాంతమ్మ కంకణం కట్టుకుంది. నీ నవలకు ప్రైజు వచ్చిన దగ్గర్నుంచి ఒకటే కుళ్లిపోతోంది. పేపర్లో 'సిరి కిరణ్' గురించి అంతా ఇంతా మేకప్ కాదు. నీ గురించి ఒక్కమాట వ్రాయించిందా! మరంచేత సభకు వెళ్లకు. ఎగ్గొట్టేయ్! అలాగయితేనే పరువు దక్కుతుంది' అని కరాఖండిగా చెప్పేశారు.

ఆ పెద్ద తలకాయ మాట మా ఆవిడకి శిరోధార్యమైంది.

ఆ రోజు సాయంత్రం సభనగా, ఉదయం మా పక్కింటి కుర్రాడు ఏదో పేపర్ పట్టుకు తిరుగుతుంటే అడిగి చూశా! అంతే బుర్ర గిర్రున తిరిగిపోయింది. తనకది కుళ్లు కాలువ పక్క దొరికిందట.

అదేమో... సన్మాన సభ కరపత్రం. తాటికాయలంత అక్షరాలతో 'సిరి కిరణ్' పేరు...

కొసన మినీ అక్షరాలతో కావ్యశ్రీ పేరు... హతోస్మి!!

ఆవిడ ఆగ్రహానికి అంతూ పంతూ లేకుండా పోయింది. కరపత్రం పరపర చింపి పారేసింది.

పేపర్లో చూసి పరిగెత్తుకెళ్లి హాజరవటానికి, తాయిలం చూసి పరిగెత్తే పాపాయిని కాదని... వెళ్లనంటూ భీష్మించుకు కూర్చుంది.

సభా సమయం కూడా దాటిపోయింది. హమ్మయ్య! గండం గడిచినట్లే అనిపించింది.

రాత్రి తొమ్మిదయినాక నేనే ప్రవాసరావుకి ఫోన్ చేశా. తను సభకెళ్లి ఇప్పుడే వచ్చానని, సభలో సిరి కిరణానికి అదే పనిగా చెక్క భజన చేయటానికి, మెడలో దండలేయటానికే కాలమంతా మింగేసిందని... మిగిలిన సన్మానితులు ధనలక్ష్మి, ఆర్ముగం, కోదండమ్మ తమవంతు వచ్చే వేళకి మొహం వేలాడేసే స్థితికి చేరుకున్నారని, అంతేకాదు... సిరికిరణ్ తన కవితలు ప్రారంభించగానే, వున్న ఆ కాస్త జనం కూడా క్రమేపీ పలచబడ్డారని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

'నువ్వు అవమానం జరగకుండా తప్పించుకోవటం మేలయింది' అన్నాను.

'అవునండీ! లేకపోతే ఆ కాంతమ్మ ఎంత కుట్ర పన్నిందనీ... నన్ను పిలిచి మరీ ఫూల్ చేయదలచింది...' అని నవ్వేసింది.

ఈ సన్మానం గొడవ కాదు గానీ మూడు రోజులై తిన్నగా నిద్ర లేదు. ఆ రోజు రాత్రి మాత్రం కంటి నిండుగా నిద్రించాం.

లేవంగానే పాచి మొహంతోటే పేపర్ చదవటం... ధ్యాస మా ఆవిడకి! ఒకే ఒక్క వెర్రికేక...

'ఏమండీ! చూడండి... ఎంత ఘోరమో! ఆ 'సిరి కిరణ్'తోపాటుగా నాకు ఘనంగా సన్మానం జరిగినట్లుగా ఆ కాంతమ్మ పేపర్లో నొక్కి వక్కాణించింది. నేనస్సలు సభకు పోలేదే... ఇదెలా!' అని ఒకటే ఏడుపు.

ఆమె చదివిన పేపర్ తప్పుగా ప్రచురించిందేమోనని... మా అపార్ట్‌మెంట్‌లో నాల్గు పేపర్లూ అడిగి తిరగేశాం... అదే కథా కమామీషూనూ...

'అయ్యో! నా పరువు పోయిందండీ...' అని మరోసారి బావురుమంది.

మాలో మేం మల్లగుల్లాలు పడుతూ వుంటే పరుగు పరుగున గురుదత్త గారు విచ్చేశారు.

'ఇదేం బాగోలేదు మీకు... నేను సన్మానానికి 'వద్దు వద్దు' అంటూంటే పోలోమంటూ పారిపోతారా! ఆ సిరి కిరణ్ సరసన నిన్ను చూడలేకనే నేను వేదిక దిక్కే పోలేదు. అలాటిది ఘన సన్మానాలు చేస్కుందికి వెర్రెత్తిపోతారా!' అంటూ వెర్రెత్తిపోయారు. నిప్పులు తొక్కారు.

'బాబాయిగారూ! మీరు ఏదో పేపర్ న్యూస్ పట్టుకుని...'

'అదే నేనూ చెప్పబోతున్నాను. నేనేం పేపర్ చూసి పప్పులో కాలేయలేదు. సాక్షాత్తూ పక్కాగా చెప్పిన 'సత్య విజన్' న్యూస్‌లో ఆ కాంతమ్మే ఇంటర్వ్యూలో... మైకు గొట్టం పట్టుకుని మరీ చెప్పింది– 'నిన్ను సన్మానించడం తనదృష్టంగా భావించిందట... నా గుండెలు మండిపోయాయనుకో– ఆవిడ బిల్డప్‌కి' అని ఒకటే చిందులేశారు.

గురుదత్త గారిని శాంతింపజేయటానికి మేం ఎలాంటి పుర్రాకులు పడ్డామో ఆ దేవుడికెరుక.

ఆయన కదిలేదాకా మేం ఈ లోకంలో లేం...

ఈ ప్రహసనమంతా జరిగిన మూడు రోజుల తరువాత ప్రవాసరావు ద్వారా తెలిసిన విషయం... 'ఇదివరలో ఓ సభకు పిలిచి, కనీసం మొమెంటోలు ఇవ్వని చేదు అనుభవం గుర్తొచ్చిన విలేకరులు ఈ సభకు ఎగ్గొట్టారట. అందువల్ల తనకు తానే ఓ న్యూస్ తయారుచేసి పత్రికాఫీసుల కిచ్చేసిందట...'

దానివల్ల అడ్డమైన వాళ్లూ మా ఆవిడ్ని 'మీకు సన్మానం జరిగిందట... ఏం మాతో చెప్పలేదూ... చెబితే వచ్చేవాళ్లంగా...' అని అడుగుతుంటే, 'సన్మానం అయిందని తను ఒప్పుకోలేక, అవలేదని చెప్పి మొత్తం కథంతా పూసగుచ్చి వివరించలేక నానా బాధలూ పడ్తున్నదంటే నమ్మండి!

మరి ఇటువంటి నరకయాతన మీరెన్నడయినా, ఎప్పుడయినా అనుభవించారా?! చెప్పండి! ❑